# అసలు మనిషి

–తన్నీరు సీతారామాంజనేయులు

**సర్కార్ ఎక్స్‌ప్రెస్ గుడివాడ రైల్వే స్టేషన్‌లో ఆగింది. మసక చీకటి ఇంకా మాసిపోలేదు. స్టేషన్‌లో కొంచెం సందడి చెలరేగింది. ప్లాట్‌ఫాం అంతా కూలిజనంతో నిండి వుంది. జీవన గమనం కోసం ఈ ప్రాకులాట!**

తూర్పు దిక్కున చీకట్లు తొలగిపోతున్నాయి, అటు వైపు నించి పుట్టుకొస్తున్న వెలుగు రేఖలకి. పక్షుల కిలకిలారావాలు! గూళ్ళ నుంచి కేరింతలు కొడుతూ ఆహారం కోసం వేట ప్రారంభం!

"ఆ పుస్తకం దొరుకుతుందేమో అన్నాను.!"

"ఎక్కడ దొరుకుతుందంటావు?" నీరజ ప్రశ్న.

"హిగ్గిన్ బాదమ్స్‌లో"

"అమృతం కురిసిన రాత్రేనా!"నీరజ అడిగింది.

"ఊ!"

"నమ్మకం లేదు నాకు" నీరజ నీరసంగా అంది.

'పోనీవే రెండడుగులు ప్లాట్‌ఫాం మీద తిరుగుదాం!"

"సరే! న్యూస్ పేపర్ కొనుక్కుందాం!" నీరజ ఉపాయం చెప్పింది.

నీరజా, నేనూ క్రిందికి దిగాం! చల్లని పిల్లగాలి శరీరానికి తగిలి హాయి గొలిపింది. ప్లాట్‌ఫారం మీద అడుగులు వేస్తున్నాం.

"పాపక్కయ్యా!" ఎవరో పిలిచినట్టుంది.

అనుమానంగా వెనుదిరిగాను. ఒకమ్మాయి వడివడిగా నవ్వుకుంటూ నావైపు రావడం చూశాను. నీరజ పుస్తకాల షాపు వైపు వెళ్ళింది. నేను మా ఇంట్లో పెద్ద దాన్నవ్వటాన, నన్ను పెదపాప అంటారంతా నాకు నలభై దాటినా. అందరూ పాప అనే పిలుస్తారు. ఆ అమ్మాయి నావద్దకు వచ్చింది నవ్వుకుంటూ. ఆమెను పరికించి చూశాను. పసిమి ఛాయ! సన్నగా రివటలా వుంది.

"ఎలా వున్నావ్ పాపక్కా!" అనడిగింది తన సంతోషాన్నంతా కళ్ళనిండా నింపుకుని.

నేను అయోమయంగా చూశానామె వైపు. ఇంతకు ముందెప్పుడూ కూడా చూడలేదామెను.

"నిన్ను చూసి నాలుగేళ్ళయ్యింది. నువ్వు ఈ ట్రెయిన్‌లో విజయవాడ వస్తున్నావని నీ స్నేహితురాలు సుబ్బలక్ష్మి చెప్పింది. నిన్ను చూసి వెడదామని వచ్చాను. బావగారూ, పిల్లలూ బావున్నారా! పిల్లల చదువులు ఎలా వున్నాయి? ఎవరేమి చదువుతున్నారు? ఈ మధ్య నీవు హైదరాబాద్ వెళ్ళావా? చిన్నక్క, పెదనాన్న, పెద్దమ్మ ఎలా వున్నారు?" అని ప్రశ్నిస్తుంటే నాకు అనిపించింది ఆమె ఎవరిని గురించో నన్ననుకుంటోందని!

"సారీ!మీరు అనుకునే మనిషిని నేను కాదమ్మా!" అన్నాను.

ఆమె నొచ్చుకున్నట్టుగా అన్పించింది ఆమె ముఖంలో మారిన రంగులు చూశాక.

కళ్ళల్లో ఏదో వెర్రి ఆనందం!

"నేను పాపక్కా! చిన్నమ్మల్ని. నన్ను గుర్తుపట్టలేదా? లేకుంటే నామీద కోపం ఇంకా పోలేదా?" నవ్వుతూ అందామె.

ఏం మాట్లాడాలో తెలియరాలేదు. ఆమె చేతిని గట్టిగా నొక్కుతూ–

"నీవు పొరబడ్డావమ్మా! నేను మీ పాపక్కయ్యని కాదు. నా పేరు ప్రమీల. విజయవాడలో వుంటున్నాం. ఈమె నా తోటి ఉద్యోగిని. పేరు నీరజ. మేమిద్దరం స్నేహితురాలి ఇంట్లో పెళ్ళికని రాజమండ్రి వెళ్ళి వస్తున్నాం" అన్నాను.

ఆమె దీనంగా చూసింది. నేను నా హేండ్ బేగ్‌లో నుంచి నా గుర్తింపు కార్డు తీసి చూపిస్తే గాని ఆమె నమ్మలేదు. "నేను మావారితో తప్ప మరెవ్వరితో అబద్ధాలాడను" అన్నాను ఇంకా.

ఆమె కళ్ళు తుడుచుకుని–

"క్షమించండి! నేనే పొరబడ్డాను. మా పాపక్కయ్య ముమ్మూర్తులా మీలాగే వుంటుంది, కళ్ళ జోడుతో సహా" అంది.

"నాది మసక జోడు".

"మనిషిని పోలిన మనుషులుంటారని అంటారు! నన్ను మా ఇంటిల్లపాదీ 'పెద పాపా' అని పిలుస్తుంటారు! రామ్మా! టీ తాగుదాం! మీరేం చేస్తుంటారు?" అని ఆ అమ్మాయిని అడిగాను.

"ఇక్కడ మండల రెవిన్యూ కార్యాలయంలో ఆఫీసు రికార్డు అసిస్టెంటుగా పనిచేస్తున్నాను".

"నీ పేరేమిటమ్మా?"

"అరుంధతి! మా ఇంట్లో నన్ను చిన్నమ్మలూ అని పిలుస్తారంతా" అంది.

ముందుగా మాట్లాడినప్పుడు ఆమె నాకు ఏమైనా ట్రాప్ వేస్తోందేమోనని అనుమానించేను. కాని టీ తాగుతూ ఆమెని గురించి మరికొన్ని వివరాలు రాబట్టగలిగాను. ఆమె చెప్పిన సమాధానాలన్నీ నాకు సరిపోయాయి. ఆమెను గురించి చెడుగా భావించినందుకు నొచ్చుకున్నాను. గుడివాడ ఎమ్మార్వో నాకు తెలిసిన వాడే. పైగా పునాదిపాడు హైస్కూల్లో నా క్లాస్‌మేట్ ఆయన! నాకు తెలిసిన వాళ్ళు అందులో పనిచేస్తున్నారు. వాళ్ళని గురించి అడిగినప్పుడు అరుంధతి సరైన సమాధానాలే చెప్పింది.

నీరజ టీ డబ్బులిస్తుంటే వారించి అరుంధతే చెల్లించింది మర్యాదగా. పిమ్మట ఆమె మా వెంట కంపార్ట్‌మెంట్ వరకూ వచ్చి నిలబడింది

"అవునూ! విజయవాడలో మీ అక్కగారేం చేస్తారు?" అడిగేను అరుంధతిని.

"ఎస్.బి.హెచ్.లో క్యాషియర్. నాలుగు సంవత్సరాల క్రితం హెడ్డాఫీసులో పనిచేసేది" అంది అరుంధతి.

"ఆమె పేరు?"

"రాజేశ్వరమ్మ! మీ వయసే వుంటుంది. రింగ్ రోడ్ నుంచి బెంజి సర్కిల్ రోడ్‌లో వినాయక థియేటర్ సమీపాన బ్యాంక్ కాలనీ వద్ద సొంత డాబా వుంది. మా బావగారూ, పిల్లలూ కూడా విజయవాడ లోనే వుంటారు. ఆయన గారు లయోలా కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా చేస్తున్నారు"

"నీవంటే మీ పాపక్కయ్యకు కోపమెందుకు?" అరుంధతిని అడిగాను.

"నా చిన్నతనంలో మా అమ్మ చనిపోయింది. మా పెద్దమ్మ నన్ను పెంచి, ఆమె పిల్లలతో పాటే పెద్ద చేసింది. మా నాన్న నన్ను వదినగారి చేతిలో పెట్టి కాశీ, ప్రయాగ వెళ్ళిపోయారట! అక్క నన్ను గ్రాడ్యుయేషన్ పూర్తి చేయమంటే




వినకుండా ఈ చిన్న ఉద్యోగంలో చేరానని నన్ను తిట్టిపోసింది. అప్పటి నుంచి ఆమెకు నామీద కోపం. ఆమె గారి చిన్న చూపులు తట్టుకో లేక నన్ను నేను వెలివేసుకున్నాను. ఇక్కడే వుంటున్నాను!" అంది అరుంధతి ఆవేదనగా.

"మీ ఫ్రెండ్ సుబ్బలక్ష్మిని కూడా అడిగానని చెప్పమ్మా! వీలుంటే ఆమెని ఓసారి విజయ వాడలో మా ఇంటికి రమ్మనండమ్మా!" అడ్రస్ ఇస్తూ అన్నాను.

అరుంధతి తలూపింది సరేనని.

"మా పాపక్కయ్యంటే నాకెంతో ఇష్టం. పాప క్కయ్య ఈ బండిలో వస్తుందని తెలిపి నేను గుడివాడ రైల్వే స్టేషన్లో కలుస్తానని లెటర్ రాశాను వారం క్రితం. అది అందే వుంటుంది. ఆమెను చూసి, పలుకరించి వెడదామని ఎంతో ఆశతో వచ్చాను. కాని ఈరోజున ఆమెకు వీలు పడలేదేమో! ప్చ్! నా దురదృష్టం. ఆమెను ఎప్పుడు కలుసుకోగలనో ఏమో!" అరుంధతి ఆవేదనగా మాట్లాడింది.

రైలు కూత పెట్టింది, కదలబోతూ. రైలు ఇంకా కొంతసేపు వుంటే బావుణ్ణు– అనిపించింది అరుంధతి కథ విన్నాక.

నేనూ, నీరజా రైలుబండి ఎక్కి, తలుపు వద్ద నిలబడ్డాం.

"మళ్ళీ కలుద్దాం" అన్నాను అరుంధతితో.

"ఎలా కలుసుకుంటాం" అరుంధతిలో ఎంతో బాధ.

"నేను మీ ఆఫీసుకు వస్తానమ్మా".

"నిజం?" ఆమె కళ్ళల్లో ఎంతో ఆప్యాయత వెల్లివిరిసింది.

"నిజమేనమ్మా! టాటా" అంటూ చేయి వూపాను.

అరుంధతి కళ్ళు తుడుచుకుంటూ నావైపు చూస్తూ గాలిలో చేయి వూపుతూ టాటా చెప్పింది. రైలు కూత పెట్టుకుంటూ స్పీడందుకుంది. అరుంధతి ప్లాట్‌ఫారం మీదే నిలబడి వుంది చాలా సేపు నాకు కనుమరుగయ్యేంత వరకూ.

నీరజ సీట్లో కూర్చుని న్యూస్ పేపర్ తిరగేస్తూ వుంది. నేను నీరరజ పక్క సీట్లో కూర్చుని దూరంగా పోలాలలో వున్న తాటి చెట్లు, వెనక్కి పరుగెడుతున్న వాటిని చూస్తున్నాను అరుంధతిని తల్చుకుంటూ.

రైలుబండి దోసపాడు స్టేషన్‌ను దాటింది.

టాయిలెట్ తలుపు తోసుకుని నా పక్కగా వెడుతున్నామెను గమనించాను. నా కళ్ళకు ఏదో వింతలా తోచింది.

గుడివాడ స్టేషన్ దగ్గరవుతుండగా కూడా ఆమెను చూశాను. అప్పుడామెను సరిగ్గా గమనించలేదు. ఇప్పుడామెను పరీక్షగా చూశాను. ఆమె అచ్చం నాలానే వున్నది.